# అవగాహన

### సోమంచి ఉషారాణి



క్రైన్ కథల పోటీలో
ప్రత్యేక సంచిక కోసం
ఎంపిక చేయబడిన కథ

'ప్రేమించి పెళ్ళి చేసుకో! నీ మనసంతా హాయి నింపుకో' కూనిరాగం తీస్తూ తలదువ్వుకుంటున్న అమర్ దగ్గరకు వచ్చాడు శ్రీకాంత్.

"ఏమిట్రోయ్ మాంచి హుషారుగా వున్నట్టున్నావు! ఏమిటి విశేషం?"

"ఈరోజు వాళ్ళ అమ్మా, నాన్నలకి పరిచయం చేసి పెళ్ళికి ఒప్పిస్తానంది వసంత" సిగ్గుపడుతూ, మెలికలు తిరుగుతూ చెప్పాడు.

"మరి మీ అమ్మా, నాన్న ఒప్పుకున్నారా?"

"ముందు వాళ్ళని ఒప్పించాక మా వాళ్ళకి చెబుతాను"

"మీ వాళ్లు ఒప్పుకోక పోతే?"

"ఏదో సామెత చెప్పి నట్లు అడ్డుపుల్ల వేశావూ?" నిరాశగా చూశాడు అమర్. టైమ్ చూసుకుని, "మైగాడ్!" అనుకుని హడావిడిగా వెళ్ళిపోతుంటే 'ప్చ్!' నిట్టూర్చాడు శ్రీకాంత్.

అమర్ వెళ్ళేనరికి వసంత తల్లిదండ్రులు హాల్లో సోఫాల్లో కూర్చుని టీ.వీ. చూస్తు న్నారు. వసంత అతన్ని పరిచయం చేసినా 'ఓహో!' అని ఒకసారి చూసి, మళ్ళీ టి.వి. చూడ్డంలో మునిగి పోయారు. అమర్ కూడా ఇబ్బందిగా వాళ్ళతో టి.వి. చూడ్డంలో మునిగిపోక తప్పలేదు.

సీరియల్ మధ్యలో యాడ్స్ వచ్చినప్పుడైనా మాట్లాడతారేమో నని చూశాడు. అవి కూడా చాలా ఇంట్రస్టుగా చూస్తున్నారు. వసంతకేసి చూశాడు. బిక్కముఖం వేసుకుని 'ఈ సీరియల్' అని సైగ చేసింది వసంత.

ఎలాగో ముళ్ళమీద కూర్చున్నట్లు కూర్చున్నాడు. అదవగానే వసంత టి.వి. కట్టేసి, "నాన్నా! అమర్ మీతో ఏదో చెప్పాలని వచ్చాడు" అంది లేని సిగ్గునీ, రాని నవ్వునీ తెచ్చుపెట్టుకుంటూ.

"చెప్పమనూ!" మళ్ళీ టి.వి.లో మంచి ప్రోగ్రాం వస్తుంది" వసంత తండ్రి కళ్ళజోడు సవరించుకుంటూ చూశాడు అమర్‌కేసి. వసంత తల్లి ఏమీ పట్టనట్లు పేపరు చూస్తోంది.

"వసంత మీకు చెప్పే వుంటుంది...." నసిగాడు."ఏ విషయం?" వసంత చెబితే కదా!

"అదేనండీ! మేమిద్దరం ప్రేమించి, పెళ్ళి చేసు"

"ఓహో! మీరు కూడా మా అమ్మాయి లాగే ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించు కున్నారన్నమాట! అయితే ఆ విషయం నాకెందుకు చెబుతున్నారు? మీ అమ్మా, నాన్నల అభిప్రాయం తీసుకుని అప్పుడు ప్రేమించడం మొదలుపెడితే మంచిది. ఏమంటారు? వెళ్ళిరండి. ఇప్పుడు మా ఫేవరెట్ విలన్ సినిమా ఆడియో ఫంక్షన్ నుంది" అని టి.వి. ఆన్ చేయబోయాడు.

అమర్ నెత్తిబాదుకుంటే, వసంత విసుక్కుని, "నీ కసలు సరిగ్గా చెప్పటం చేతకాదంటూ "నాన్నా! అమర్ చెప్పేదేమిటంటే, 'మేమిద్దరం ఒకరినొకరు ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని...." అని ఆగిపోయింది.

"ఓహో అదా విషయం!" అని సాగదీస్తుంటే వసంత వాళ్ళమ్మ ఒకటే నవ్వడం! వసంత వాళ్ళ నాన్నేమో అస్సలు నవ్వడు. ఎప్పుడూ ప్రపంచంలోని కష్టాలన్నీ తనే అనుభవిస్తున్నట్లు 'ఊఁ' అని ముఖం బిగదీసుకుని సీరియస్‌గా వుంటాడు. ఆఖరికి టి.వి.లో, సినిమాల్లో వచ్చే కామెడీ సీన్స్‌కి కూడా నవ్వడు. వసంత తల్లేమో ఎప్పుడూ నవ్వుతూనే వుంటుంది. నవ్వొచ్చినా, రాకపోయినా 'కికికి' 'కిహి' 'హిహిహి' అంటూ ఇకిలిస్తూ, నవ్వంటే విరక్తి పుట్టేలా నవ్వుతూ వుంటుంది.

నవ్వితే ఆరోగ్యమనీ, అందంగా వుంటారనీ బహుశా ఆవిడ కెవరో చెప్పి వుంటారు. అందంగా నవ్వడమూ ఒక కళని చెప్పడం మర్చిపోయి వుంటారు. అంతే కాదు ఆమె నవ్వడానికి వేరే ముఖ్యకారణం వుండి వుంటుంది.

"సరే! అమర్! నువ్వు మా అమ్మాయిని పెళ్ళి చేసుకోవటానికి మాకేమీ అభ్యంతరం లేదు. ఎందుకంటే మా అమ్మాయి చదువు కుంది. ఉద్యోగం చేస్తోంది. అదేమీ చిన్నపిల్ల కాదు. దానికి కావలసిన భర్త ఎలాంటి వాడో నిర్ణయించుకునే తెలివితేటలు దానికున్నాయని మా నమ్మకం. మీ వాళ్ళకి కూడా చెప్పి వాళ్ళకి అభ్యంతరం లేకుండా వుంటే సింపుల్‌గా రిజిష్టర్ మ్యారేజ్ చేసుకోండి. 'కట్నాలూ, లాంఛనాలూ, అనవసరపు పెళ్ళి ఖర్చులూ నాకు నచ్చవు. ఏమంటావు?"

"కట్నాలూ, లాంఛనాలూ సరేననుకోండి. కనీసం పెళ్ళయినా..." ఆయన మాటలకు ఖంగుతిన్న అమర్ నసిగాడు.

"మేం మీ పెళ్ళికి ఒప్పుకోలేదనుకో! మీరు చేసుకునేది అదేగా! అంతగా కావాలంటే మీ వాళ్ళని గ్రాండ్‌గా పార్టీ అరేంజ్ చేయమను. మేమూ వస్తాం"సీరియస్‌గా చెప్పేసి, అంతకన్నా సీరియస్‌గా టీ.వీ. చూడ్డంలో మునిగిపోయా డాయన! వసంత తల్లేమో ఊరికే పడీ పడీ నవ్వుతోంది. 'మీ అమ్మగారికి పిచ్చా?' అని అడగబోయి వసంత కెక్కడ పిచ్చికోపం వస్తుందో, కరుస్తుందేమోనని పైకేమీ అనలేక కక్కలేక, మింగలేక లేచెళ్ళిపోయాడు అమర్.

అమర్ రాగానే "ఏమైందిరా? కాయా, పండా?" అన్నాడు శ్రీకాంత్. అతని కేసి అయోమయంగా చూసి,"ఆఁ మిగల పండిపోయింది" అన్న అమర్ అక్కడి నుంచి వడివడిగా వెళ్ళిపోయాడు.

"నాన్నా! నేనొక అమ్మాయిని ప్రేమించాను. పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను" నిర్ణయం తీసుకొన్నట్లు కచ్చితంగా చెప్పాడు.

"చూడుబాబూ! నువ్వు నిర్ణయం చేసేసుకున్నాక నేను కాదన్నా ప్రయోజనం లేదని నాకు తెలుసు. మాకూ కట్నాలు, లాంఛనాలు మీద ఆశేంలేదు. చదువుకుని, ఉద్యోగం చేస్తుందంటున్నావు! ఇంట్లో పనిపాటలూ, వంటా వార్పూ వచ్చో, రాదో తెలుసుకున్నావా? ఎందుకంటే పెళ్ళయ్యాక ఆ కష్టసుఖాలు అనుభవించవలసిందీ" నువ్వే అయినా రేపు మేం చెప్పలేదన్న మాట రాకూడదుగా"!

"అంతేకాదు అమర్! మీ పెళ్ళయ్యాక మీ సంసారం మీది. మీరు వేరే వుండాలి. అప్పుడే మీకు కష్టసుఖాలు తెలుస్తాయి. మీరు కోరుకునే ప్రైవసీ లభిస్తుంది. ఏమంటావు?"

"మీరు ఎంత బాగా ఆలోచిస్తారమ్మా! థ్యాంక్యూ!" తల్లిదండ్రులకేసి కృతజ్ఞతగా చూస్తూ వాళ్ళకి పాదాభివందనం చేశాడు.

"చూడు బాబూ! 'అంత్యనిష్ఠూరం కంటే ఆది నిష్ఠూరం మేల'ని ముందే చెబుతున్నాను. రేపు మీ కష్టసుఖాలు లాభనష్టాలకి మీరే బాధ్యులు. మీ మధ్య ఏవైనా గొడవలొచ్చినా, మాట తేడాలొచ్చినా మమ్మల్ని నిందించ కూడదు. ఒక్క నిజం మర్చిపోకు! అందరు ఆడవాళ్ళూ అమ్మలాగా వుండరు! కొందరాడ వాళ్ళు 'అమ్మ'లూ కాలేరనుకో! అయితే మీరిద్దరూ ఆయురారోగ్య ఐశ్వర్యాలతో పిల్లా పాపలతో నిండు నూరేళ్ళు సుఖంగా వుండా లన్నదే మా ఆకాంక్ష!

☆ ☆ ☆

అమర్, వసంతల పెళ్ళి పెద్దలు ఆశీర్వదించినట్లే సింపుల్‌గా రిజిష్టర్ మ్యారేజ్ జరిగింది. పదిరోజులు మైసూరు, బెంగుళూరు, ఊటీ, కొడైకెనాల్, కేరళా తిరిగి హనీమూన్ నుంచి హోట్ ఎర్త్‌కి దిగివచ్చారు. అన్ని హంగులూ వున్న ఒక ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారు. సంసారానికి అత్యవసరమైన కొంత సామానూ, సరుకులూ తెచ్చుకుని సర్దుకున్నారు.

ఆరోజు నుండి ఇద్దరూ ఆఫీసుకి బయలుదేరాలి. అమర్‌కి మెలకువ వచ్చేసరికి ఎనిమిదైంది. వసంత నిశ్చింతగా ఇంకా నిద్రపోతోంది. తొమ్మిందింటికల్లా బయలుదేరాలి.

"వసూ! లే! ఇంకా నిద్రపోతే వంటెప్పుడు చేస్తావు?" మనసులో చిరాకుని కప్పిపుచ్చుకుని ప్రేమగానే లేపాడు.

"వంటా? నాకు వంట వచ్చని నీ కెప్పుడు చెప్పాను?" ఉలిక్కిపడి లేచింది వసంత.

"అదేమిటి? ఆడవాళ్ళన్నాక వంట రాకుండా ఎలా వుంటుంది? పైగా గిన్నెలూ, సరుకులూ కొన్నప్పుడు కూడా..."

'నువ్వు చేస్తావని కొన్నాను" నిర్లక్ష్యంగా అంది.

"అదేమిటీ? మీ అమ్మ వంట నేర్ప లేదా?"

"మా అమ్మకే రాదు.మానాన్న చేస్తాడు

మా ఇంట్లో! అందుకే నువ్వే చేస్తావనుకున్నాను".

"మా ఇంట్లో మా అమ్మే చేస్తుంది. అదీకాక అందరిళ్ళలోనూ ఆడవాళ్లే వంట చేయడం చూశాను. అలాగే నువ్వూ...."

"అయితే నీకూ వంట రాదా?" అదేదో అతని మహాపరాధమన్నట్లు కోపంగా అడిగింది.

"ఉహూఁ ఇప్పుడెలా?" బిక్కముఖం వేశాడు అమర్.

"వంట మనిషిని పెట్టుకుందాం. లేకపోతే బయట తిందాం అదేదో అంతర్జాతీయ సమస్యన్నట్లు ముఖం పెట్టేవేమిటి? లేలే! ముందు రెడీ అవ్వు! "తొందర చేసింది. వసంత.

అమర్ అయోమయంగానే ఆఫీసుకు బయలుదేరాడు. ఆఫీసులో అందరూ 'పార్టీ' అని గొడవ చేశారు. సాయంత్రం ఇద్దరి ఆఫీసు వాళ్ళకి 'డిన్నర్' ఇచ్చి, సంతోషంగా ఆ రాత్రి ఇంటికి చేరుకున్నారు.

"అమ్మా!తనకి వంట రాదుట! ఎవరైనా వంట మనిషిని చూడమ్మా! బయట ఎంతకాలం తింటాం?డబ్బు దండగా,ఆరోగ్యం పాడవు తుంది" సెల్‌ఫోనులో తల్లికి చెప్పాడు అమర్.

"అదేమిట్రా వంటరాకపోతే నేర్చుకో మను. అదేమన్నా బ్రహ్మవిద్యా? శని, ఆది వారాలు సెలవేగా! నేను వచ్చి నేర్పిస్తాలే! తల్లి మాట వినేసరికి కొండంత ధైర్యం వచ్చి సంబర పడిపోయాడు. ఆ విషయమే ఉత్సాహంగా భార్యతో అనేశాడు.

ఆ అల్పసంతోషిని అలాగే చూసి నవ్వింది వసంత "అదేదో నువ్వే నేర్చుకో! నా కస్సలు ఇంట్రస్టులేదు. ఇంకోసారి వంటా, పెంటా అన్నావంటే విడాకులిచ్చేస్తాను" నవ్వుతూ అని ముసుగెట్టేసింది.

"మొదట అలాగే అంటుందిలే! తరువాత తనే నేర్చుకుంటుంది' అని సమర్ధించు కుంటూ తనూ ముసుగెట్టాడు అమర్. వసంతని పెళ్ళిచేసుకుంటానని అడగడానికి వెళ్ళినప్పుడు ఆమె తల్లి అన్ని రకాలుగా ఎందుకు పడి పడి నవ్విందో అప్పుడర్ధమైంది అమర్‌కి 'తన అమాయ కత్వానికి జాలిపడి నవ్విందన్నమాట! ఎంత దారుణం!'

'తను నిజంగా అమాయకుడే! తెలివి తక్కువ వాడే! తనే కాదు చాలా మంది ప్రేమి కులు అమాయకంగా మోసపోతున్నారు! అమ్మాయిల పైపై మెరుగులకీ, అందానికీ, ఒయ్యారానికీ మురిసిపోయి, పార్కులకీ, హోటళ్ళకీ త్రిప్పుతూ, వాళ్ళు అడగనివీ, అడిగి నవీ కొనిస్తూ, స్వీట్ నథింగ్స్ చెప్పుకోవటమే కానీ,వంటవచ్చా, ఇల్లు సర్దుకోవడం, పెద్దలనూ, బంధువులనూ ఆదరించడం, గౌరవించడం తెలుసా ఇవేవీ మాట్లాడుకోరు. ఇప్పుడాలోచిస్తే ప్రేమికులు ఎంత చెత్త మాట్లాడుకొంటారో, ఎంత సమయం వృధా చేస్తారో అర్ధమౌతోంది.

"ఏమిటీ ఇంకా నిద్రపోకుండా ఆలో చిస్తున్నావు? మనం ప్రేమించుకున్న రోజులు గుర్తు వస్తున్నాయా? ఆ రోజులే బావుండేది" అని నిట్టూర్చి మరోవైపు తిరిగి పడుకుంది వసంత.

'బావుంటాయి. ఎందుకు బావుం డవూ? ఖర్చులేని ఎంజాయ్‌మెంట్ కదా!' పళ్ళు పటపట కొరికాడు అమర్. ప్రేమించి పెళ్ళి చేసుకుని, నెల తిరక్కుండానే పెళ్ళాంనోట విడాకులు మాట వినడం కంటే దౌర్భాగ్యం ఇంకేం వుంటుంది?' జుత్తు పీక్కున్నాడు.

☆ ☆ ☆

"వసూ! నాకు తలనెప్పిగా వుంది"

"అమృతాంజనం రాసుకో! దానికోసం ప్రొద్దున్నే నా నిద్రెందుకు పాడుచేస్తావు? సెలవు రోజైనా హాయిగా పడుకోనివ్వవా?"

"వసూ! మనిద్దరం అసలు ప్రేమించి పెళ్ళి చేసుకున్న వాళ్ళమేనా? పెళ్ళికి ముందు నాకు తలనెప్పంటే ఎంత కంగారు పడేదానివి? అయినా నిన్ను అమృతాంజనం వ్రాయ మన్నానా? తల పట్టమన్నానా? 'బ్రూ' పాకెట్ ఉందిగా! కాస్త వేడివేడిగా కాఫీ కలిపిమ్మంటు న్నాను. అంతేగా!" తనూ విసుక్కున్నాడు అమర్.

"అదేదో నువ్వే కలుపుకోవచ్చుగా! నాకు రాదు మొర్రో అంటున్నా నన్నే కలప మంటావు. మీ మగాళ్ళంతా శాడిస్టులు. పెళ్ళాం సుఖంగా పడుకున్నా, సరదాగా ఎక్కడికన్నా తిరిగి వచ్చినా, ఎవరితోనైనా నవ్వుతూ మాట్లా డినా సహించలేరు".

"అమ్మా తల్లీ! నువ్వు కాఫీ కలిపి ఇవ్వకపోతే పోయింది. మా మగాళ్ళందరినీ నిందించడమెందుకు? నీకో దండం, నీకాఫీకో దండం, నిన్నింత వైనంగా పెంచిన మీ వాళ్ళకో దండం!"

"మధ్యలో మా వాళ్ళను తీసుకొస్తా వెందుకు? నువ్వేమైనా అనదలచుకుంటే నన్నను. మీకు చదువుకోవాలి,అందంగా వుండాలి, డబ్బు సంపాదించాలి, ఇంట్లో పనులన్నీ చేయాలి. ఇంకా కట్నకానుకలు కూడా ఇస్తే మరీ మంచిది. మీరేమో మహారాజుల్లా కాలుమీద కాలేసుకుని అది చేయి. ఇది తీసుకురా అంటూ...".

అమర్‌తల్లి వచ్చేసరికి ఇద్దరూవాదించు కుంటున్నారని అర్ధమైంది. ఆవిడ చకచకా ఇల్లంతా సర్దుతూ కాఫీపెట్టి, మూడు కప్పుల్లో పోసి తీసుకువచ్చింది.

తల్లినీ, తల్లి చేతికాఫీనీ చూసేసరికి ప్రాణం లేచి వచ్చింది. కొడుకుని అలా చూసే సరికి సహజంగానే ఆ తల్లికి జాలివేసి, ప్రాణం కొట్టుకుపోయినా పైకి కనబడనీయలేదు.

"చూడమ్మా! మగవాడెప్పుడూ మహ రాజే! అలాగని నేనేదో ఆడవాళ్ళు తక్కువా, మగవాళ్ళెక్కువా అని వెనకేసుకొస్తున్నానని అనుకోకు. భర్తకి సేవ చేయడంలోనూ, అతని కిష్టమైనవి చేసిపెట్టడంలోనూ వుండే ఆనందం అనుభవైకవైద్యం! భర్తను శారీరకంగా సుఖ పెట్టినా అది ఇద్దరికీ సంబంధించింది. ఎందు కంటే అందులో తృప్తినీ, ఆనందాన్ని ఇద్దరూ అనుభవిస్తారు. కానీ భోజ్యేషుమాతా, కార్యేషు దాసీ అంటే..."

"అవన్నీ పాతచింతకాయ పచ్చడి కబుర్లు! రుచిగా వండిపెడితే పెళ్ళాం మాత్రం సంతోషించదా? దాసుడిలా సేవలు చేస్తే ఆ ఇల్లాలు మెచ్చుకోదా? ఎంతసేపూ ఆడవాళ్ళే మగవాడికి సేవలు చేయాలా? అయినా ఇద్దరూ ఒకలాగే పుడుతున్నారు, పెరుగుతున్నారు, చదువుకుంటున్నారు, ఉద్యోగం చేస్తున్నారు, సంపాదిస్తున్నారు. ఆ మాటకొస్తే ఆడవాళ్ళే ఎక్కువ సంపాదిస్తున్న సందర్భాలు కూడా వున్నాయి. అటువంటప్పుడు ఇంకా దాసీలా సేవలెందుకు చేయాలి? 'నలభీమ పాకం' అన్నారు కానీ 'దమయంతీ, ద్రౌపదీ పాకం'

అనలేదుగా! అందుకే వంట చేయవలసింది మగవాడే!" వసంత అలా మాట్లాడుతుందని ఊహించని ఆ తల్లీ కొడుకులు అవాక్కయ్యారు.

'చూడు బాబూ!నేను ముందే చెప్పినట్లు నువ్వు ఇష్టపడి పెళ్ళి చేసుకున్నావు కనుక ఆ కష్టనష్టాలు నువ్వే అనుభవించు. ఇందులో నేను కలుగజేసుకుంటే నా మర్యాద దక్కేట్లు లేదు. నీకెప్పుడు మమ్మల్ని చూడాలనిపిస్తే అప్పుడు రా! ఇద్దరూ రండి. ఇంక నేను వెడతాను" అని వెళ్ళిపోయిందావిడ. అమర్ ముఖం చిన్నబుచ్చుకున్నాడు.

"పద అమర్! మా ఇంటికి వెడదాం. మా నాన్న వంట చేయడంలోనే కాదు చిటికెలో నేర్పడంలో కూడా సిద్ధహస్తుడే!"

వసంత మాటలకి ఒళ్ళు మండింది అమర్‌కి "మరైతే నువ్వెందుకు నేర్చుకోలేదూ?"

"చెప్పానుగా నాకు ఇంట్రస్టు లేదు. అదీగాక 'మనింట్లో ఆడవాళ్ళకి వంట అచ్చిరాదు' అంది అమ్మ!"

"తప్పించుకోవడానికి అదొక వంక!" గొణిగాడు అమర్. అప్పుడే శ్రీకాంత్ వచ్చాడు.

"ఏమిట్రా మీ ప్రోగ్రాం? ఎక్కడికో బయలుదేరినట్టున్నారు" అన్నాడు శ్రీకాంత్.

"మా సంగతేం అడుగుతావు కానీ నువ్వు మాత్రం చస్తే ప్రేమించి పెళ్ళి చేసుకోకు" అన్నాడు అమర్.

"బ్రదర్! ప్రోబ్లం ప్రేమించి పెళ్ళి చేసుకోవడంలో ఉండదు. ఇద్దరి మధ్యా సరైన అవగాహన లేకపోవడంలో వుంటుంది".

**సమీక్ష**

# పేరుకే 'భావచిత్రాలు'

\- సశ్రీ

హైకూ ఓ పదచిత్రం. దీనినే భావచిత్రం, సాక్షర చిత్రం (ఇమేజ్) అంటున్నాం. ఆంగ్ల సాహిత్యంలోకి 1912లో ఓ ఉద్యమంగా ఇమేజిజం రావటం వెనక హైకూ స్ఫూర్తి ఉందని, ఇంగ్లీష్ కవులు ఈ విషయంలో జపానీ కవులకి రుణపడ్డారంటారు ఎజ్రా పౌండ్. (ఈయన కొంతకాలం డబ్ల్యూబీ యేట్స్‌కి సహాయకుడిగా ఉన్నారు - టీ యస్ ఇలియట్ రాసిన వేస్టు ల్యాండ్‌ని సగానికి సగం తగ్గించి గొప్పగా ఎడిట్ చేసాడు పౌండ్).




**భావచిత్రాలు**
(హైకూలు)
**రచయిత :** పి.లక్ష్మణరావు
వెల : రూ. 15/-
**ప్రతులకు:**
పి.లక్ష్మణరావ్,
పోతుబరి వీధి,
సాలూరు,
విజయనగరం జిల్లా.

అదే 'భావ చిత్రాలు' పేరుతో పిలక్ష్మణరావ్ 180 హైకూల్ని ఓసంపుటిగా తెచ్చారు. 'హైకూల తోటలో వాలిన మరో కొత్త కోకిల"గా లక్ష్మణ్‌కి కితాబిచ్చారు ముందుమాటలో అద్దేపల్లి. పదచిత్రాలు అనదగ్గ హైకూలు చాలాతక్కువగానేఉన్నాయి. ప్రాకృతిక హైకూలూ, సామాజిక హైకూలు రెండూ సమపాళ్లలో రాసారు లక్ష్మణరావ్.

"నక్షత్రాలకు - వెలుగునిస్తుంది - చీకటి" అనటం బావుంది. "నీడకు - నేనంటే భయం - కిందే ఉంటుంది" అంటూ మరో హైకూ "ప్రతిసారి - స్నానం చేసి నీళ్లు మోస్తుంది - చేదకు చాదస్తమే" అంటారు లక్ష్మణ్. రెక్కలు వచ్చినా తల్లిని వీడని పక్షి -చెట్టు... కొమ్మను -వీడిన ఫలితం-వాడిన పువ్వు ... వసంతాన్ని - పచ్చడి చేస్తే - ఉగాది... గాలి రెక్కలపై - చిన్నారికి జోల - ఊయల... ఇలా కొన్ని మంచి హైకూలున్నాయి.

మానవ ప్రకృతిని ప్రతిబింబించే హైకూలకీ ఈ పొత్తంలో కొదవలేదు. "చంద్రలోకం వెళ్లి -మట్టిని తెచ్చారు -వెన్నెల వదిలేసి" అంటూ చమత్కరిస్తాడు కవి. రాయికే-నిత్య నైవేద్యం-అన్నార్తులకు పస్తులే.... ఇండియా కట్నం కోసం- అమెరికా చదువులు - తేనె పూసిన కత్తులు...పాఠకులు- పూర్వం ఉండేవారట-టీవీలు రాకముందు... మొదలయినవి సామాజిక చైతన్య పూరితాలు. కింద,బతుకు,సొంత, రాసిన లాంటి మాటలకు బదులు క్రింద, బ్రతుకు, స్వంత, వ్రాసిన అంటూ దొర్లిన లోపాల్ని మినహాయిస్తే ఓసారి తిరగేయాల్సిన 78 పుటల పొత్తమిది.

**సాహితీ ప్రియులందరికీ స్వాగతం**
**వారం వారం సాహిత్య విహారం**
**ప్రతీ శనివారం, ఆఖరి ఆదివారం**
**ఒకే వేదిక - ఒకే సమయం**, (సా॥ గం॥ 6:15 ని॥లకు)
**చంద్ర రాజేశ్వరరావు లైబ్రరీ హాల్**, ప్రజాశక్తి నగర్, విజయవాడ.
**నిర్వహణ : చినుకు సాహిత్య మాసపత్రిక**